

రంగధాంపల్లి వద్ద హత్యకు గురైన బోదాసు శ్రీనివాస్ (ఫైల్)



సిద్దిపేటకు చెందిన బోదాసు శ్రీదేవి, ఇట్టవేన సతీష్ పాత బస్టాండ్ దగ్గర కల్లు దుకాణంలో ఒకరికొకరు పరిచయమై ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో, తొగుట మండలం పెద్ద మాసాన్‌పల్లికి చెందిన బోదాసు నర్సింలు శ్రీదేవి వెంటపడటం ప్రారంభించాడు. నర్సింలు తమ బంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన వారు అతన్ని చంపేసి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. జూన్ 7న రాత్రి వీరు ముగ్గురు రంగధాంపల్లిలోని వైన్స్ సమీపంలో మద్యం సేవించిన తర్వాత, సతీష్ నర్సింలును పిడిగుద్దులతో కొట్టి చంపాడు. త్రీ టౌన్ పోలీసులు నిందితులు శ్రీదేవి, సతీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సిద్దిపేట డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన బి.శ్రీనివాస్, కరీంనగర్‌కు చెందిన పర్వతం రాజు మంచి స్నేహితులు. రాజు గత కొంతకాలంగా తన భార్య పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. ఫిబ్రవరి నెలలో వారు సిద్దిపేటలో కలుసుకోగా.. రాజు, శ్రీనివాస్‌ను నర్సాపూర్ చౌరస్తాలో నిర్మిస్తున్న బిల్డింగ్‌లోకి తీసుకెళ్లి, మద్యం తాగించి అసభ్యకరంగా ప్రవర్తించబోయాడు. శ్రీనివాస్ ప్రతిఘటించడంతో ఆగ్రహించిన రాజు, సెంట్రింగ్ కర్రతో కొట్టి అతన్ని చంపేశాడు.

బీహార్ రాష్ట్రానికి చెందిన బొలారం హరిజన్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అతడు మైనర్ అయిన మనీషాను ఆమె తల్లిదండ్రులకు తెలియకుండానే ప్రేమ వివాహం చేసుకుని బీహార్ నుంచి సిద్దిపేటకు వచ్చి ఆదర్శనగర్ వెనుక దక్కల కాలనీలో అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. హరిజన్‌కు మద్యం తాగే అలవాటుతో పాటు ఇతర దురలవాట్లు కూడా ఉన్నాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరి 14న రాత్రి హరిజన్ బాగా తాగి వచ్చి, మనీషాతో గొడవపడ్డాడు. కోపంతో ఆమె తలను గోడకు కొట్టి, గొంతు నులిమి చంపేశాడు. తర్వాత శవాన్ని అక్కడే ఉన్న మేర సంఘం భవనం సంపులో పడేసి, మూతపెట్టి బీహార్‌కు పారిపోయాడు.

ఈ మూడు ఘటనలు సిద్దిపేటలో నేరాల తీవ్రతను, వాటికి మద్యం ఏవిధంగా కారణమవుతుందో తెలియజేస్తుంది. మద్యం మత్తులో జరుగుతున్న ఘర్షణలు, వ్యక్తిగత కక్షలు, అసభ్య ప్రవర్తనలు హత్యల వరకు దారితీస్తున్నాయి. తాగిన మైకంలో ఇతరుల ప్రాణాలను బలిగొంటున్నారు. అర్ధరాత్రి వరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంతో జరుగుతున్న అనర్థాలివి.

మద్యం మత్తులో మట్టుబెడుతున్నారు


సిద్దిపేట క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇటీవల బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, దాని వల్ల జరిగే నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. చాలామంది బహిరంగ ప్రదేశాల్లో, ముఖ్యంగా ఖాళీ స్థలాల్లో, వెంచర్ ప్లాట్లలో మద్యం తాగుతున్నారు. తాగిన మైకంలో పరస్పర దాడులకు పాల్పడుతూ, కొన్ని సందర్భాల్లో హత్యల వరకు వెళ్తున్నారు. మద్యం మత్తులో కోపోద్రిక్తులై తమ వాళ్లనే చంపుకున్న సంఘటనలు చోటుచేసుకున్నాయి.

మద్యం తాగే చోటే సెటిల్‌మెంట్లు

మద్యం తాగే ప్రదేశాల్లోనే ఆస్తి, ఇతర సెటిల్‌మెంట్లు జరుగుతుండడం కూడా గొడవలకు దారితీస్తున్నాయి. మద్యం మత్తులో మాట మాట పెరిగి, దాడులు చేసుకునే స్థాయికి వెళ్తున్నాయి. భూ వ్యాపారాలు కూడా మద్యం తాగుతూ మాట్లాడుకోవడం, ఆ విషయాల్లో గొడవలు

మిగతా 8లో..


సిద్దిపేటలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై తాగి పడేసిన మద్యం సీసాలు





మంత్రి పొన్నంను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ హైమావతి

హుస్నాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బదిలీపై వచ్చిన కలెక్టర్ హైమావతి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రఫుల్ దేశాయ్ కూడా మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం వారిని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

విద్యాధరి క్షేత్రాన్ని దర్శించుకున్న కలెక్టర్

వర్గల్ : వర్గల్ విద్యాధరి క్షేత్రాన్ని ఆదివారం కలెక్టర్ హైమావతి సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజల అనంతరం ఆలయ మండపంలో ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి కలెక్టర్ హైమావతికి సరస్వతీ అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజు, సిబ్బంది ఉన్నారు.

ఫలితాల్లో అమోఘం.. ప్రతిభలో ఆదర్శం

- అన్నింట్లో రాణిస్తున్న లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు
- హైడ్రోజన్ రాకెట్ ప్రయోగంతో జాతీయస్థాయి గుర్తింపు

8

మరింత చేరువగా రైతునేస్తం

- సాగుపై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు
- రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సెట్లు..
- హుస్నాబాద్ డివిజన్‌లో అదనంగా 12 సెట్లు
- ప్రతీ మంగళవారం రైతువేదికల్లో ప్రత్యక్ష ప్రసారం
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

హుస్నాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవలి కాలం వరకు అరకొరగా ఉపయోగించిన రైతువేదికలను ఇక నుంచి పూర్తిస్థాయిలో వినియోగించనున్నారు. వ్యవసాయ సాగులో ఆధునిక సాంకేతిక విజ్ఞానం.. వివిధ పంటల సాగులో మెలకువలపై శాస్త్రవేత్తలతో ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమం చేపట్టింది. ప్రతీ మంగళవారం ఉదయం రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు పంటల సాగు ఇతర అంశాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వివరించనున్నారు. ఇందుకు గతంలో ఉన్నవి కాకుండా అదనంగా రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సెట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 1031 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేయనున్నారు. సిద్దిపేట జిల్లాలో 71 రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సెట్లు ఏర్పాటు చేశారు. ఇక హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్‌లో ఇప్పటి వరకు హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, అక్కన్నపేట మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సెట్లు ఉన్నాయి. ప్రస్తుతం హుస్నాబాద్ మండలంలో మహ్మదాపూర్, మీర్జాపూర్, కోహెడ మండలంలో బస్వాపూర్, శనిగరం, బెజ్జంకి మండలంలో వడ్లూరు బేగంపేట, కల్లెపల్లి, అక్కన్నపేట మండలంలో జనగామ, రామవరం రైతు వేదికల్లో వీటిని ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వీటిని ప్రారంభించిన అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడనున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రైతులను సమీకరిస్తున్నారు.


హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సెట్

సాగులో మెళకువలు



పంటల సాగులో ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రముఖ వ్యవసాయ శాస్త్ర వేత్తలు ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతువేదికల్లో వివరిస్తారు. పంటల సాగులో మెలుకవలు తెలుసుకుని అధిక దిగుబడులు పొందేందుకు ఇది ఎంతో దోహదపడుతుంది. హుస్నాబాద్ డివిజన్‌లో గతంలో నాలుగు వీడియో కాన్ఫరెన్స్ సెట్లు ఉండగా ప్రస్తుతం మరో 8 సెట్లను రైతు వేదికల్లో ఏర్పాటు చేశాం.

- శ్రీనివాస్, హుస్నాబాద్ ఏడీఏ

నిర్లక్ష్యం మాటున స్వచ్ఛ టాయిలెట్లు

- గతంలో ప్రజలు, ప్రయాణికుల ప్రయోజనం కోసం ఏర్పాటు
- జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా తొలగింపు
- పనులు పూర్తయినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు


పోలీస్‌స్టేషన్ సమీపంలో నెలకొల్పిన టాయిలెట్లు (ఫైల్)

చేర్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రదేశాల్లో కొన్నాళ్ల క్రితం ఏర్పాటు చేసిన స్వచ్ఛటాయిలెట్లు నిర్లక్ష్యం మాటున మూలుగుతున్నాయి. నిత్యం పట్టణానికి వచ్చే ప్రజలు, ప్రయాణికుల ప్రయోజనం కోసం రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసినా నిరుపయోగంగా మారాయి. పట్టణం విస్తరిస్తుండడం, ప్రతీ మంగళవారం వారాంతపు సంతకు వందలాది చిరువ్యాపారులు, ప్రజలు తరలివస్తున్న క్రమంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఆశించిన మేర టాయిలెట్లు లేక అత్యవసర పరిస్థితుల్లో మల, మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేర్యాలను 2018లో మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన అప్పటి ప్రభుత్వం సంపూర్ణ స్వచ్ఛత దిశగా స్వచ్ఛ టాయిలెట్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంది. స్థానిక కుడి చెరువు, పోలీస్ స్టేషన్, పెద్దచెరువు, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. కొంత కాలం పాటు అరకొరగా నిర్వహించినప్పటికీ, ఆ తర్వాత పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. కొద్దిమేర ప్రయాణీకులు, బాటసారులు టాయిలెట్లను వినియోగించుకున్నప్పటికీ సూర్యాపేట-సిరిసిల్ల జాతీయ రహదారిలో భాగంగా జనగామ-సిద్దిపేట ప్రధానదారి విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డు మధ్యలో నుంచి 50 ఫీట్ల ప్రామాణికంతో డ్రైన్ పనులు చేపట్టడంతో పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని టాయిలెట్లను తొలగించి మున్సిపల్ పరిధిలోని అంగడిబజారు వాటర్‌ట్యాంక్ ఆవరణలో ఖాళీస్థలానికి తరలించారు. నిర్వహణ సరిగా లేక పిచ్చిమొక్కలు అలుముకోవడంతో పాటు తుప్పుపట్టి వృథాగా మారాయి. చాలా కాలం క్రితమే డ్రెయిన్ నిర్మాణం పనులు పూర్తయినప్పటికీ తిరిగి టాయిలెట్లను నెలకొల్పి అందుబాటులోకి తీసుకురావడం లేదు. వివిధ గ్రామాల నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్ కక్షిదారులు వస్తుంటారు. పాత బస్టాండు వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఉండటం, పొరుగు గ్రామాలకు వెళ్లే ప్రయాణీకులు వేచి ఉంటున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో కోర్టును ఏర్పాటు చేయడం, తరచూ కేసుల కోసం నాలుగు మండలాల ప్రజలు వస్తున్నారు. దీంతో ఆయా ప్రదేశాలలో జనాలు అధికంగా ఉండడం వల్ల టాయిలెట్లు అవశ్యమైనప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయాణికులు, బాటసారులు తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డుపక్కన విసర్జన చేస్తున్నారు. పరికరాలు, ముడిసరుకులున్నా కేవలం బిగించడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఖాళీ ప్రదేశంలో నిల్వ చేసిన టాయిలెట్లు పాడైపోతున్నాయి. ప్రజలు, ప్రయాణికులు, బాటసారుల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం ముడిపడి ఉన్నప్పటికీ మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చోద్యం వీడి త్వరితగతిన బిగించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డువిస్తరణ కారణంగా తొలగించి వాటర్‌ట్యాంక్ ఆవరణలో పక్కన పెట్టడంతో పిచ్చిమొక్కల మధ్య వృథాగా ఉన్న టాయిలెట్లు


సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

విద్యార్థి నాయకుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

సిద్దిపేట క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి నాయకుడిపై పదునైన ఆయుధాలతో దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాచర్ల రాంబాబు మాట్లాడుతూ నిత్యం విద్యారంగ సమస్యలపై దేశ సమస్యలపై సామాజిక సమస్యలపై పోరాట చేసే ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్యపై రాజ్యాంగ వ్యతిరేక గూండాలు దాడి చేయడం బాధాకరం అన్నారు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని చెప్పినందుకు దాడి చేయడం సరికాదన్నారు. కార్యకర్తలకు ఏబీవీపీ రాష్ట్ర శాఖ అండగా ఉంటుంది అని చెప్పారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యుడు వివేక్, రాష్ట్ర హాస్టల్ కో కన్వీనర్ పవన్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణీంద్ర, నగర కార్యదర్శి పర్శరామ్, రాహుల్, వసంత్, లోకేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు.. అమ్మకు బోనాలు

- కొమురవెల్లి, వర్గల్ ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- హుస్నాబాద్‌లో బోనాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

జిల్లాలోని ప్రముఖ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కొమురవెల్లి, వర్గల్ విద్యాధరి, నాచగిరి ఆలయాలకు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వర్గల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో చిన్నారులకు వర్గల్ విద్యాధరి క్షేత్రంలో సామూహిక అక్షర స్వీకారాలు చేయించారు. నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పుష్కరిణీలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండ ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో ఆలయ అధికారులు సుధాకర్, నరేందర్, పాండు తగిన ఏర్పాట్లు చేశారు.


విద్యాధరి క్షేత్రంలో చిన్నారులకు సామూహిక అక్షర స్వీకారాలు


అమ్మవారికి బోనం సమర్పించడానికి వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయన సతీమణి మంజుల

కొమురవెల్లిలో...

చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నాన మాచరించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. స్వామివారి దర్శనం కోసం సుమారు 2 గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో అన్నపూర్ణ, ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పర్యవేక్షించారు.

బోనం సమర్పించిన పొన్నం దంపతులు

హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌లోని రెండవ వార్డులో ఉన్న పోచమ్మ దేవి ఆలయంలో ఆదివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు కుటుంబ సమేతంగా బోనం సమర్పించారు. మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి పొన్నం ప్రభాకర్ ఆయన సతీమణి మంజుల ఆలయం వరకు వెళ్లి బోనాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామవరం రోడ్డులో ఉన్న పోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కుటుంబ సమేతంగా మొక్కులు సమర్పించుకున్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో రాత్రి రేణుకా ఎల్లమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించారు. బోనాల ర్యాలీలో శివసత్తుల పూనకాలు, బైండ్లోళ్ల డప్పుల దరువుల ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చైర్మన్ కేడం లింగమూర్తి, ఈవో కిషన్‌రావు, నాయకులు చిత్తారి రవీందర్, అక్కు శ్రీనివాస్, వరప్రసాద్, పూదరి శ్రీనివాస్ తదితరులున్నారు.

సంగారెడ్డి మెడికల్ కళాశాలకు షోకాజ్ నోటీసులు



సంగారెడ్డి అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు(జీఎంసీ) నేషనల్ మెడికల్ కమీషన్(ఎన్ఎంసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రధానంగా అధ్యాపకుల కొరత, హాస్టల్ వసతి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడడం, వైద్య విద్య తరగతుల నిర్వహణకు సరిపడా గదులు, ల్యాబ్‌లు లేకపోవడం తదితర కారణాలతో ఎన్ఎంసీ తాజాగా నోటీసులను జారీ చేసింది. అయితే, గతేడాది ఎన్ఎంసీ వర్చువల్‌గా జరిపిన పరిశీలనలో పక్కా హాస్టల్ భవనాలు సిద్ధం కాకపోవడం, ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర టీచింగ్ ఫ్యాకల్టీ కొరత, థియరీ, ప్రాక్టికల్స్‌కు సరిపడా తరగతి గదుల లేకపోవడం తదితర సౌకర్యాల లేమిని గుర్తించి నోటీసులు జారీ చేసినట్టు కళాశాల అధికార వర్గాలు తెలిపాయి. 2022లో ప్రారంభమైన ఈ కళాశాలలో ప్రస్తుతం 450 మంది విద్యార్థులతో మూడో వైద్య విద్యా సంవత్సరం కొనసాగుతున్న విషయం తెలిసిందే.



ఖాజాపూర్‌లో తాగునీటికి తిప్పలు

సిర్గాపూర్/కల్హేర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సరిపోకపోవడంతో సగం గ్రామస్థులు ఒకే బోరు మోటారు దగ్గర కుస్తీలు పట్టుకుంటూ నీరు తీసుకువెళ్తున్నారు. ఇప్పటికైనా నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

● తప్పిన పెను ప్రమాదం

కొండపాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కొమురవెల్లి కమాన్ వద్ద రాజీవ్ రహదారిపై ఆగి ఉండగా లారీ ఢీకొట్టిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో లారీ క్లీనర్‌కు గాయాలు కాగా, బస్సు ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తూ ప్రయాణికులను దించేందుకు కొమురవెల్లి కమాన్ వద్ద ఆగింది. అదే వైపు నుంచి అతి వేగంగా వస్తున్న లారీ బస్సు వెనుక వైపును ఢీకొట్టింది. లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. క్లీనర్ అందులోనే ఇరుక్కుపోయాడు. బస్సులోని ప్రయాణికులు దిగడం కోసం బస్సు ముందు వైపుకు రావడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటనతో రహదారిపై వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికులతో కలిసి పోలీసులు, టోల్ ప్లాజా సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు జరపడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది. సుమారు అరగంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. లారీ క్లీనర్‌కు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెక్కుచెదరని ఆనవాళ్లు..!

● సింగూరు ప్రాజెక్టులో ముంపు జ్ఞాపకాల్లో ఆలయాలు, దర్గాలు
● పరిహారం కోసం కోర్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న 72 గ్రామాల బాధితులు

మునిపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు నిర్మాణం 1979లో ప్రారంభమై 1989లో పూర్తయింది. ఈ మధ్య కాలంలో ప్రాజెక్టు కారణంగా విడతలవారీగా జిల్లావ్యాప్తంగా 72 గ్రామాలు, 37,478 ఎకరాల భూమి ముంపునకు గురైంది. వేలాది మంది రైతులు, గ్రామస్థులు తమ కన్న ఊళ్లను వదిలి వెళ్లక తప్పలేదు. అధికారులు ముంపు గ్రామాలకు సమీపంలోనే కొత్త ఇళ్ల స్థలాలను గుర్తించి నిర్మించి ఇచ్చారు.

మునిపల్లి, రాయికోడ్, పుల్కల్, న్యాల్కల్, మనూర్, రేగోడ్, వట్‌పల్లి వంటి మండలాల పరిధిలోని సుమారు 49 గ్రామాలు పూర్తిగా ముంపునకు గురికాగా, 23 గ్రామాలు పాక్షికంగా మునిగిపోయాయి. 42 వేల మంది రైతులకు చెందిన నుంచి 37,478 ఎకరాల భూమి ప్రాజెక్టులో మునిగిపోయింది. అప్పట్లో ఎకరాకు సుమారు రూ.17 వేల చొప్పున పరిహారం చెల్లించారు. అయితే, ఇప్పటికీ కొన్ని గ్రామాలకు రెండు పర్యాయాలు పరిహారం అందినపప్పటికీ, మరికొన్ని గ్రామాలకు సంబంధించిన కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ముంపు బాధితులు తమ పరిహారం కోసం ఇంకా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అందోల్ ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ తీసుకుని పరిహారం అందేలా కృషి చేయాలని బాధితులు కోరుతున్నారు.



పాత మల్లికార్జున్‌పల్లిలో పురాతన ఇల్లు



అల్లాపూర్‌లో తాత-అవ్వ దర్గా

బయటపడుతున్న చరిత్ర!

ఎండాకాలంలో సింగూరు ప్రాజెక్టు నీటి మట్టం తగ్గినప్పుడు మునిగిపోయిన గ్రామాలకు సంబంధించిన అనేక ఆనవాళ్లు బయటపడుతుంటాయి. పొలాల్లోని సారవంతమైన నల్లరేగడి భూములు కనిపించడంతో రైతులు గతంలో పండించిన దిగుబడులను గుర్తుచేసుకుంటారు. కొన్ని గ్రామాల్లో ముంపునకు గురైన భూములు తేలినప్పుడు, రైతులు వాటిలో వివిధ పంటలను వేస్తూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటారు. అయితే, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, అది నిండినప్పుడు ఈ భూములు మళ్లీ నీటిలో మునిగిపోతుంటాయి. ప్రాజెక్టు నిర్మాణంలో విలువైన భూములు కోల్పోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పవచ్చు.

చెక్కుచెదరని ఆలయాలు, దర్గాలు

మునిపల్లి మండలంలోని మల్లికార్జునపల్లి, అల్లాపూర్, తక్కడపల్లి, మల్లారెడ్డిపేట, బుసారెడ్డిపల్లి, బోడపల్లి, పిల్లోడి, గార్లపల్లి, మక్తక్యాసారం, కల్లపల్లి-బేలూర్ వంటి గ్రామాలు పూర్తిగా సింగూరు ప్రాజెక్టులో మునిగిపోయినప్పటికీ, ఆయా గ్రామాల్లోని పాత దేవాలయాలు, దర్గాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇవి భక్తులకు నిత్యం దర్శనమిస్తూ పూజలు, ప్రార్థనలు అందుకుంటున్నాయి.

● మల్లికార్జునపల్లిలోని అతి పురాతన సిద్దేశ్వర దేవాలయం, పాత ఇళ్లు, బురుజు, తక్కడపల్లిలోని హనుమాన్ దేవాలయం, అల్లాపూర్‌లోని తాతా-అవ్వ దర్గా ఇప్పటికీ భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఈ పురాతన కట్టడాలను చూసినవారు మట్టితో కట్టినప్పటికీ ఎంత గట్టిగా ఉన్నాయో.. అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

● గతంలో సిద్దేశ్వర ఆలయంలో గుర్తుతెలియని దొంగలు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ఘటన అప్పట్లో పెద్ద సంచలనంగా మారింది. ఆ తర్వాత మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన గడీల నవాజ్ రెడ్డి గ్రామ పెద్దలతో కలిసి ఆలయాన్ని పునఃప్రారంభించాలని నిర్ణయించారు. దీంతో 13 జూన్ 2022న ఆలయాన్ని పునఃప్రారంభించి గత వైభవాన్ని తిరిగి తీసుకొచ్చారు. అప్పటినుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయానికి వెళ్లినప్పుడు పాత ఊరి జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు.



పురాతన బురుజు



ఏళ్ల నాటి అమ్మవారి శిల్పం

నిత్యం పూజలు చేస్తున్నా..



మండలంలోని పాత మల్లికార్జునపల్లి గ్రామంలోని అతి పురాతనమైన సిద్దేశ్వర స్వామి ఆలయంలో పునఃప్రారంభించినప్పటి నుంచి నిత్యం పూజలు చేస్తున్నాను. వందల ఏళ్ల నాటి పురాతన దేవాలయం అయినప్పటికీ, గ్రామ పెద్దలు గడీల నవాజ్ రెడ్డితో పాటు గ్రామస్థులు, దాతల సహకారంతో శిథిలావస్థకు చేరిన దేవాలయాన్ని పునఃప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులు తాగునీటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పురాతన చేతి పంపు బోరును పునరుద్ధరించి మంచి నీటిని అందిస్తున్నాం. భక్తులు అన్నదాన వితరణ కూడా చేస్తున్నాం.

-నాని స్వామి, సిద్దేశ్వర ఆలయ పూజారి, మల్లికార్జునపల్లి



అల్లాపూర్‌లో చెక్కు చెదరని అప్పటి పాఠశాల

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



శ్రీను(ఫైల్)

జోగిపేట రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట బుడగజంగం కాలనీకి చెందిన ఈత శ్రీను(21) మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి కొత్త బట్టల కోసం ఇంట్లో డబ్బులు అడగగా, కుటుంబ సభ్యులు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీను రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇందిరానగర్ కాలనీ వెనుక ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి మామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, డబ్బుల కోసం చోరీలు చేస్తూ జల్సాలకు అలవాటు పడిన శ్రీను పలు కేసుల్లో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడని, తరుచూ కేసులకు హాజరై కోర్టుల చుట్టూ తిరగలేకపోతున్నానని తమతో చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

మద్దూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ వ్యక్తి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం, మద్దూరు గ్రామానికి చెందిన ఎండీ జిలానీ కుటుంబం జీవనోపాధి కోసం హైదరాబాద్ వలస వెళ్లారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు వెంటనే స్థానిక ఎస్ఐకి సమాచారం అందించారు. ఆయన హుస్నాబాద్‌లోని ఫైర్ ఇంజన్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే చేరుకున్న ఫైర్ ఇంజన్ అధికారులు ఎస్ఎఫ్‌వో రాజయ్య, ఏఎల్ఎఫ్ మల్లికార్జున్, డీవోపీ శ్రీకాంత్, హోంగార్డ్స్ సిబ్బందితో కలిసి మంటలను ఆర్పివేశారు. ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని, కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని ఎస్ఐ తెలిపారు.

ప్రాణం తీసిన డ్రైవింగ్ సరదా

● ట్రాక్టర్ కిందపడి బాలుడి మృతి





మృత దేహం వద్ద బోరుమంటున్న కుటుంబీకులు

నర్సాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సరదాగా కాసేపు ట్రాక్టర్ నడుపుతానంటూ తీసుకున్న 15 ఏళ్ల బాలుడికి అదే ట్రాక్టర్ కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదకర ఘటన నర్సాపూర్ మండలం నారాయణపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపూర్‌కు చెందిన పిచ్చకుంట్ల లక్ష్మి, రాజు దంపతుల రెండో కుమారుడు వినయ్ 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం తమ సొంత ట్రాక్టర్‌తో పొలంలో మట్టిని చదును చేయడానికి కుటుంబ సభ్యులు వెళ్లారు. వినయ్ తర్వాత బర్రెలను తీసుకుని పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో తాను ట్రాక్టర్ కాసేపు నడుపుతానంటూ తీసుకుని నడుపుతుండగా, పొలంలో ఎత్తుగడ్డపై అదుపుతప్పి కింద పడ్డాడు. అదే సమయంలో వెనక ఉన్న ట్రాలీ అతడిపై పడటంతో అక్కడికక్కడే చనిపోయాడు. అదే ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరిలో ఒకరికి గాయాలు కాగా, మరొకరికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నర్సాపూర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సరదాగా ట్రాక్టర్ నడిపి ప్రమాదంలో మరణించి వినయ్ తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

● యువకుడికి తీవ్ర గాయాలు

మనోహరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం 44వ జాతీయ రహదారిపై జీడిపల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొన్నది. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా రాజిపల్లికి చెందిన విఠల్ మెదక్ నుంచి బైక్‌పై హైదరాబాద్ వెళ్తుండగా, జీడిపల్లి జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విఠల్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారి సహాయంతో అతడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రోడ్డు ప్రమాదం పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ విషయంపై పోలీసులను అడగగా, వారికి ఎలాంటి సమాచారం లేదని, రోడ్డు ప్రమాదం జరిగిన విషయం వాస్తవమే అని మాత్రమే తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

● రాష్ట్ర ఆయిల్‌పామ్ టెక్నికల్ అడ్వైజర్ రంగనాయకులు



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న రంగనాయకులు

వెల్దుర్తి, జూన్15(ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగుతో రైతు సంపాదన స్థాయిని పెంచుతుందని రాష్ట్ర ఆయిల్ పామ్ టెక్నికల్ అడ్వైజర్ వైఎస్ రంగనాయకులు అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని ఎల్కపల్లి గ్రామంలో రైతు సత్యనారాయణగౌడ్‌కు చెందిన ఆయిల్ పామ్ తోటను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలో లక్షా 2 వేల ఎకరాల్లో సాగవుతుందన్నారు. ఆయిల్‌పామ్ 40 ఏళ్ల పాటు దిగుబడి ఇస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా 259 లక్షల టన్నుల ఆయిల్ పామ్ వినియోగిస్తుంటే.. కేవలం 97 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగుకు అత్యధికంగా సబ్సిడీ అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా మేనేజర్ కృష్ణారావు, డిప్యూటీ మేనేజర్ అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఐఐటీహెచ్‌లో ముగిసిన అంతర్జాతీయ యువ శాస్త్రవేత్తల సదస్సు

● ఆటోమోటివ్ సంస్థతో టీహన్ ఒప్పందం



సదస్సులో పాల్గొన్న దేశ, విదేశీ శాస్త్రవేత్తలు

కంది, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో ఈ నెల 10 నుంచి జరుగుతున్న అంతర్జాతీయ యువ శాస్త్రవేత్తల సదస్సు ఆదివారం ముగిసింది. 60 దేశాలకు చెందిన 135 మంది యువ శాస్త్రవేత్తలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ పురాతన తత్వవేత్తల సహకారాలతోనే నేటి టెక్నాలజీ అభివృద్ధి చెందిందన్నారు. అంతరిక్ష మిషన్లు, ఆహార భద్రత, ఆటోమేషన్, రోబోటిక్స్, బిగ్ డేటాలో మైలురాళ్ల ద్వారా దేశం యొక్క అద్భుతమైన పురోగతి సాధించిందని తెలిపారు. ఈ సదస్సులో ఇండియన్ నేషనల్ సైన్స్‌అకాడమీ అధ్యక్షుడు పద్మశ్రీ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ, ఐఐటీ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్.మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, స్వయం ప్రతిపత్త ఆటోమోటివ్ టెక్నాలజీలలో సహకరించడానికి ఆదివారం ఐఐటీహెచ్ టీహన్(టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ అటానమస్ నావిగేషన్)తో ఒప్పందం చేసుకున్నది. ఈ సంతర్భంగా ఐఐటీహెచ్ టీహన్ అధిపతి ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి, ఆటోమోటివ్ సంస్థ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు

ఘనంగా లలితా పరమేశ్వరీ ఆలయ వార్షికోత్సవం

తూప్రాన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి వెంకటాపూర్ (పీటీ) శివారులోని శ్రీలలితా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం సప్తమ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, దేవీ ఉపాసకులు, సహస్రాధిక చండీయాగ నిర్వాహకులు సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మహాపూజ, మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, 1216వ చండీయాగం నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో జన్మించిన చిన్నారులకు రవీంద్రశర్మ ఆధ్వర్యంలో తులాభారం చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న లలితాపరమేశ్వరీ మాత



హోమంలో పాల్గొన్న భక్తులు





ఇస్రోలో శిక్షణకు హాజరైన విద్యార్థులు

ఫలితాల్లో అమోఘం..

ప్రతిభలో ఆదర్శం

● అన్నింట్లో రాణిస్తున్న లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు
● యువికా(యువ విజ్ఞాని కార్యక్రమం)లో సత్తా
● హైడ్రోజన్ రాకెట్ ప్రయోగంతో జాతీయ స్థాయి గుర్తింపు
● వ్యర్థాలతో సంపద, విద్యుత్ తయారీ

దుబ్బాక, జూన్15(ఆంధ్రజ్యోతి) : దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు పరిశోధన, కళలు, క్రీడలు వంటి పలు రంగాల్లో తమ అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి ప్రశంసలు అందుకుంటున్నారు. పరిమిత వసతులు ఉన్నప్పటికీ, వాటిని అధిగమించి తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

హైడ్రోజన్ రాకెట్ ప్రయోగం..

పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, కౌశిక్, సుశాంత్ ఇటీవల హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో హైడ్రోజన్ రాకెట్‌ను ప్రదర్శించి అందరి దృష్టిని ఆకర్షించారు. తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ఉద్దేశించిన ఈ రాకెట్ డిజైన్‌ను ఇస్రో అధికారులు గుర్తించారు. యువికా(యువ విజ్ఞాని కార్యక్రమం)లో భాగంగా నిర్వహిస్తున్న అంతరిక్షంపై అవగాహన, పరిశోధనలపై 15 రోజుల శిక్షణకు వారిని ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 12 మంది ఎంపిక జరిగితే, అందులో ముగ్గురు లచ్చపేట ఆదర్శ పాఠశాల నుంచే ఎంపిక కావడం విశేషం. గత మే 16నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని అంతరిక్ష విభాగం పరిశోధనా కేంద్రంలో శిక్షణ పొందారు.



హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో హైడ్రోజన్ రాకెట్ ప్రయోగంపై బహుమతి పొందుతున్న లచ్చపేట విద్యార్థులు

వ్యర్థాల నుంచి సంపద సృష్టి, క్రీడల్లోనూ విజయాలు

విద్యార్థులు వ్యర్థాల నుంచి సంపదను సృష్టించే లక్ష్యంతో వినూత్న ప్రయోగాలు చేపట్టారు. చెక్కపొట్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడం, భవనంపై పడిన నీటిని ఉపయోగించి విద్యుత్ తయారు చేయడం వంటి ప్రాజెక్టులతో రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శన ఇచ్చి అందరినీ ఆకర్షించారు. క్రీడా రంగంలోనూ లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల తుక్కుగూడలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్, యోగా, కబడ్డీ పోటీలలో విద్యార్థులు విజయం సాధించారు. యోగాలో ఇద్దరు, కబడ్డీలో నలుగురు రాణించారు. కరాటేలో ఒక విద్యార్థి బంగారు పతకం సాధించగా, ఏడుగురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌లో ఎంపికై ఉపకారవేతనాలు పొందుతున్నారు.



రాష్ట్రపతి భవన్‌లో వ్యర్థాలతో సంపదను, విద్యుత్‌ను తయారు చేయడంపై ప్రయోగాత్మకంగా చూపెడుతున్న విద్యార్థులు

కళా ఉత్సవ్‌లో రాష్ట్ర స్థాయి ప్రతిభ

నల్గొండ జిల్లాలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కళా ఉత్సవ్‌లో లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు తొమ్మిది మంది వివిధ అంశాలలో తమ సత్తా చాటారు. ఆరుగురు విద్యార్థులు జానపద బృంద నృత్యంలో, ఒకరు చిత్రలేఖనంలో బహుమతులు సాధించారు. మరో ఇద్దరు పెయింటింగ్ త్రీడీ చిత్రాల తయారీలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు.

అద్భుతమైన ఫలితాలు

ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాలలో కూడా ఈ పాఠశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. ఇటీవల ఎస్సెస్సీ ఫలితాలలో అత్యధికంగా 562 మార్కులు సాధించగా, 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 32 మంది ఉన్నారు. ఇంటర్‌లోనూ 98 శాతం ఉత్తీర్ణతతో లచ్చపేట ఆదర్శ పాఠశాల గుర్తింపు పొందింది. సుమారు 500 మంది పాఠశాల విద్యార్థులు, 220 మంది కళాశాల విద్యార్థులు ఇక్కడ విద్యాబోధన సాగిస్తున్నారు.

నిర్లక్ష్యపు నీడలో చారిత్రక కట్టడాలు

● వెల్దుర్తిలో ప్రాభావం కోల్పోతున్న కాకతీయుల కట్టడాలు
● ధ్వంసమవుతున్న శిల్పసంపద
● పట్టించుకోని పురాతత్వశాఖ

వెల్దుర్తి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు సామ్రాజ్యాన్ని పాలించిన కాకతీయుల కాలం నాటి అద్భుత కట్టడాలు వెల్దుర్తి మండల కేంద్రంలో నేడు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. నాటి కాకతీయ రాజులు తమ పాలనకు గుర్తుగా అనేక ఆలయాలు, శిల్పాలు, ఇతర కట్టడాలను నిర్మించారు. వెల్దుర్తి ఆనాడు పాలనా కేంద్రంగా ఉండటంతో ఇక్కడ కూడా పలు దేవాలయాలు, నిర్మాణాలు వెలిశాయి. అయితే, నాటి నుంచి నేటి వరకు వీటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇవి మట్టిలో కూరుకుపోయి, శిథిలమై, చెట్ల పొదల్లో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు, పురావస్తు శాఖ శీత కన్ను వేయడంతో ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాచీన కట్టడాలు తమ ప్రాభవాన్ని కోల్పోతున్నాయి.



శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన విఠలేశ్వరాలయం



నేటికీ జీవం ఉట్టిపడేలా..

చారిత్రక ఆనవాళ్లు ఇలా ధ్వంసమవుతుండటంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నాటి శిల్పాలు నేటికీ జీవం ఉట్టిపడేలా ఉండగా, మరికొన్ని నిర్లక్ష్యపు నీడలో కనుమరుగవుతున్నాయి. ఆదరణ కొరవడటంతో ఇవి భవిష్యత్తులో నామరూపాలు లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. క్రీ.శ 1162లో కాకతీయ రుద్రదేవుడు వరంగల్ జిల్లా హన్మకొండలో వేయి స్తంభాల గుడిని నిర్మించిన సమయంలోనే వెల్దుర్తిలో కూడా ఈ కట్టడాలు నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

భూమిలో కూరుకుపోయి..

వెల్దుర్తి పట్టణంలోని అంగడి స్థలంలో శిథిలావస్థలో ఉన్న దేవాలయాలు, శిలాశాసనాలు, విగ్రహాలు చెల్లాచెదురుగా భూమిలో కూరుకుపోయాయి. ఆలయ ప్రాంగణంలో ఒకవైపు శివాలయం, మరోవైపు వైష్ణవాలయం, వాటికి ఎదురుగా ఎత్తైన సింహద్వారం, గరుడ స్తంభాలు ఉన్నాయి. అర్ధచంద్రాకారంలో చెక్కిన శ్రీమన్నారాయణ స్వామి, కాళీమాత, విఘ్నేశ్వరుడు, నంది విగ్రహాలు ఆలనాపాలనా లేక ఆరుబయట పడి ఉన్నాయి. ఎనిమిది అడుగుల కాళీమాత విగ్రహం ధ్వంసమై చెట్ల పొదల్లో ఉండిపోయింది. ఈ కట్టడాలు 800 ఏళ్ల క్రితం నిర్మించినట్లు తెలుస్తోంది. అలాగే, విఠలేశ్వరాలయం పక్కన గణపతి, నంది, శివలింగ విగ్రహాలు కూడా ఆరుబయట ఉన్నాయి. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ కట్టడాలు, ఆలయాలు నిరాదరణకు గురవుతున్నాయి.

వెలుతురు నుంచి వెల్దుర్తిగా...

మండల కేంద్రమైన వెల్దుర్తిలో వారాంతపు సంత జరిగే ప్రదేశంలో తూర్పు దిశగా 20 అడుగుల ఎత్తైన సింహద్వారం ఉంది. ఈ ద్వారానికి ఆరు రంధ్రాలున్నాయి. ఒక్కో రుతువులో ఒక్కో రంధ్రం నుంచి సూర్యకిరణాలు సింహద్వారం ఎదురుగా ఉన్న వైష్ణవాలయంలోని శ్రీమహావిష్ణువు నాభిపై పడి తిరిగి లోకానికి వెలుగును ఇస్తాయని ఇక్కడి వారి విశ్వాసం. అందుకే వెలుతరు అనే పేరు వచ్చిందని, కాలక్రమేణా వెలుతురు అనే పదం వెల్దుర్తిగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు.

కుడి చెరువు పేరు ఎలా వచ్చిందంటే..


వెల్దుర్తిలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన విఠలేశ్వరాలయం కూడా ఉంది. దీని పరిసరాల్లో నటరాజు, నంది, గణపతి తదితర విగ్రహాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. సింహద్వారం, దీప స్తంభాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ దేవాలయానికి దగ్గరలోనే కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన చెరువు ఉంది. దీనిని అప్పట్లో గుడి కుంటగా పిలిచేవారని, ప్రజలు తాగునీటిని సైతం ఇక్కడి నుంచే తెచ్చుకునేవారని చెబుతారు. కాలక్రమేణా ఇది కుడి చెరువుగా పిలువబడుతోంది. ప్రస్తుతం ఈ చెరువు ఆయకట్టు 250 ఎకరాల వరకు ఉంది.



కాకతీయ తోరణం (సింహద్వారం)

ప్రభుత్వం, అధికారులు స్పందించాలి

శిథిలావస్థలో ఉన్న ఈ చారిత్రక కట్టడాలు, ఆలయాల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం, పురావస్తు శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంతో ఘన చరిత్ర కలిగిన మన వారసత్వ సంపదను కాపాడాలని, వాటి సంరక్షణకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





ధ్వంసమైన కాళిమాత, నంది లింగం విగ్రహాలు

గృహ కార్మికులు సంఘటితమై

నేడు అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం

● యూనియన్ ఏర్పాటు చేసిన మెడ్వాన్ సంస్థ
● హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి కృషి
● సంగారెడ్డి జిల్లాలో 58 వేల మంది

సంగారెడ్డి రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో పనిచేస్తూ అవమానాలు, అనచివేతలకు గురవుతున్న గృహ కార్మికులకు మెడ్వాన్ సంస్థ అండగా నిలుస్తోంది. పరిశ్రమల్లో, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే వారికి ఉన్నట్లే గృహ కార్మికులకూ ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసి, వెయ్యి మందికి పైగా సభ్యత్వం కల్పించింది మెడ్వాన్. ఈ యూనియన్‌లో ఉన్న సభ్యులకు ఏ సమస్య వచ్చినా మెడ్వాన్ అండగా ఉంటోంది. అంతేకాకుండా, గృహ కార్మికుల పిల్లలను బడిలో చేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నది. గృహ కార్మికులు, ఇంటి యజమానులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నది.



వెట్టి చాకిరీతో దుర్భర జీవితం

తమ కుటుంబాలను పోషించుకునేందుకు గృహ కార్మికులు సంవత్సరాల తరబడి వెట్టిచాకిరి చేస్తున్నా సరైన ఫలితం దక్కడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్లలో పనులు చేస్తున్నప్పటికీ సరిపోను డబ్బులు ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. పరిశ్రమల్లో 8 గంటలు పని చేసే వారికి రూ. 12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనాలు వస్తుండగా, తాము ఇళ్లలో సెలవులు లేకుండా నెల రోజుల పాటు నిర్విరామంగా పనిచేస్తున్నామని సరిపోను డబ్బులు చెల్లించడం లేదని వాపోతున్నారు. లైంగిక వేధింపులు, దొంగతనాల నిందలు వేసి భౌతిక దాడులకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. కానీ మెడ్వాన్ గృహ కార్మికుల సంఘం ఏర్పాటు చేసినప్పటి నుంచి తమ సమస్యలకు చెక్ పడిందంటున్నారు. తమ హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడుతున్నామన్నారు. దీంతో ఇంటి యజమానులు తమతో మర్యాదగా నడుచుకుంటున్నారని చెబుతున్నారు. కాగా, సంగారెడ్డి జిల్లాలో సుమారు 58 వేల మంది గృహ కార్మికులు ఉన్నారు.

వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి



పని ఎక్కువవుతున్నా చాలీచాలని వేతనాలే ఇస్తున్నారు. పనికి తగ్గట్టు వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి. సంఘం ఏర్పాటైన తర్వాత తమను గౌరవంగా పిలుస్తున్నారు.ఏమైనా సమస్యలుంటే మెడ్వాన్ కార్యాలయంలో సమావేశం పెట్టి పరిష్కరిస్తున్నారు. తెలిపారు.

-సునీత, నారాయణరెడ్డి కాలనీ, సంగారెడ్డి


మమ్మల్ని కార్మికులుగా గుర్తించాలి



ఇళ్లలో పనిచేసే తమను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలి. ఇందిరమ్మ ఇళ్లు, మహిళా శక్తి పథకం తమకూ వర్తింపజేయాలి. గతంలో చద్దన్నం పెట్టినా, వంద రూపాయలు ఇచ్చినా ఇంటి పని మొత్తం చేసేవాళ్లం, అమర్యాదగా మాట్లడేవారు. యూనియన్‌లో చేరిన తర్వాత జీతం ఇవ్వడమే కాకుండా, తమతో మంచిగా మాట్లాడుతున్నారు.

- నర్సమ్మ, విద్యానగర్ కాలనీ, సంగారెడ్డి

గృహ కార్మికుల్లో మార్పు వస్తుంది



ఇళ్లలో పనిచేసే గృహ కార్మికుల్లో మార్పు వస్తుంది. వారి సమస్యలను తోటి కార్మికులు పరిష్కరించుకునేలా అవగాహన, చైతన్య సదస్సులు నిర్వహించి మార్పు తీసుకువస్తున్నాం. కార్మికుల పిల్లలు బాల కార్మికులుగా మారకుండా మెరుగైన విద్యనందించేలా ప్రోత్సహిస్తున్నాం. యజమానులు వారిని చిన్న చూపు చూడకుండా మనుషులుగా గుర్తించాలని అవగాహన కల్పిస్తున్నాం.

- మధుసూదన్‌రెడ్డి, మెడ్వాన్ డైరెక్టర్

కోలుకుంటున్నా.. ఆందోళనపడొద్దు

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజల దీవెనలు, ప్రార్థనలు, ఆశీర్వాదాలతో త్వరగా కోలుకుంటున్నానని, ఎవరూ ఆందోళన పడొద్దని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌లో కింద పడి గాయాలపాలైన ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యేను కలవడానికి పార్టీ శ్రేణులు, అభిమానులు ఆస్పత్రికి వెళ్తున్నా.. కలవలేని పరిస్థితి ఉండటంతో ఆదివారం ఓ వీడియో ద్వారా ఆయన సందేశాన్ని పోస్ట్ చేశారు. కాలికి మేజర్ ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నట్లు తెలిపారు. వైద్యుల సలహా మేరకు ఎవరినీ కలవలేకపోతుండటం విచారంగా ఉందన్నారు. వారం రోజుల్లో మీ అందరినీ కలిసి కష్టనష్టాల్లో పంచుకుంటానని పేర్కొన్నారు.

సిద్దిపేటలో బ్రహ్మ కమలం



సిద్దిపేట క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):సిద్దిపేట పట్టణంలోని ఓ టీచర్ ఇంట్లో అరుదైన బ్రహ్మకమలం విరబూసింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలో నివాసముండే ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు బొందయ్య ఇంట్లో శనివారం రాత్రి 11 గంటలకు కమలం పూసింది. అరుదైన పుష్పం కావడంతో ఈ విషయం తెలుసుకున్న కాలనీ వాసులు పెద్ద ఎత్తున వారి ఇంటికి చేరుకొని బ్రహ్మకమలానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదేళ్ల తర్వాత బ్రహ్మ కమలం కనిపించిందని బొందయ్య పేర్కొన్నారు.

తెలుగు సాహిత్యంలో కీర్తి పొందిన కవి శ్రీశ్రీ

సిద్దిపేట కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలోని ప్రతీ వస్తువుపై రచన చేస్తూ తెలుగు సాహిత్యంలో ఎనలేని కీర్తి గడించిన కవి శ్రీరంగం శ్రీనివాసరావు బాటలో నవకవులు సాగాలని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం, యువకవి బస్వ రాజకుమార్ పేర్కొన్నారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో వారు శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. సమాజానికి స్ఫూర్తినిచ్చే రచనలు, రచయితలను మరువకూడదన్నారు. ముఖ్యంగా శ్రీశ్రీ సమాజ శ్రేయస్సు కొరకు పాటుపడ్డారని, వారి బాటలో సాగాలని పిలుపునిచ్చారు.

హౌసింగ్ బోర్డు సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణ హౌసింగ్ బోర్డు కాలనీ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బొలుగం రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా టి.మల్లారెడ్డి, ఆస లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా బెజ్జంకి శ్రీనివాస్‌రెడ్డి, డి.సందీప్ రెడ్డి, కోశాధికారిగా జె.విష్ణువర్ధన్ రెడ్డిలను ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు.

18న మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపికలు

కొండపాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరానికి స్పోర్ట్స్ స్కూల్లో నాలుగో తరగతి ప్రవేశానికి గాను కొండపాకలో మండల స్థాయి ఎంపికలు ఈ నెల 18న జరుగుతాయని ఎంఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు కొండపాకలోని వేద ఇంటర్నేషనల్ స్కూలు ఆవరణలో ఎంపికలు జరుగుతాయన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మద్దూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల సంక్షేమంకోసం నాగపురి కుటుంబం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. మద్దూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు రూ.10.14లక్షల విలువైన చెక్కులను ఆదివారం మండలకేంద్రంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు నాగపురి కిరణ్‌కుమార్ అందజేశారు.

తెలంగాణ ప్రజా ఫ్రంట్ మహాసభలను విజయవంతం చేయాలి

సిద్దిపేట క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29, 30 తేదీలలో హనుమకొండలో జరిగే తెలంగాణ ప్రజాఫ్రంట్ నాలుగో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు కోరారు. ఆదివారం వారు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్లో తెలంగాణ ప్రజా ఫ్రంట్ మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు జంగిటి నరసింహులు, రాష్ట్ర బాధ్యులు సత్తయ్య, చంద్రమౌళి పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిరుగులేని శక్తిగా కాంగ్రెస్

వర్గల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్‌కు తిరుగులేని శక్తిగా ఎదుగుతున్నట్లు తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు పేర్కొన్నారు. ఆదివారం గౌరారం వద్ద జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ తప్పిదాలు పేదల పాటిట శాపంగా మారాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

సమస్యలపై నిరంతర పోరాటం

సిద్దిపేట అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యలపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్ అన్నారు. ఆదివారం సీపీఎం సిద్దిపేట జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు రెండో రోజు సందర్భంగా ఆయన పార్టీ నిర్మాణం ప్రజా సంఘాల కార్యకర్తలకు తరగతులను బోధించారు.

ప్రహసనంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

- వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా నమోదు చేయాల్సిన ఉన్నా సిబ్బంది నిర్లక్ష్యంతో ఇక్కట్లు
- ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా వసూళ్ల దందా
- అధికారులపై రైతుల ఆగ్రహం



చేర్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు కేంద్రప్రభుత్వం కల్పించిన పథకాల లబ్ధి పొందేందుకు విధిగా ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు కొద్దిరోజుల క్రితం వ్యవసాయశాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో ఉచిత నమోదును ప్రారంభించారు. కానీ ఇతరత్రా పనుల పేరిట పలువురు ఆన్‌లైన్ ఇంటర్‌నెట్ సెంటర్లకు లింక్ అందించి నమోదు చేయిస్తుండటంతో ప్రహసనంగా మారింది. దీంతో సదరు నిర్వాహకులు ఇదే అదనుగా భావించి ఒక్కో రైతు వద్ద నుంచి సుమారు రూ.60 చొప్పున వసూలు చేస్తున్నారు. వ్యవసాయశాఖ సిబ్బందే ఉచితంగా నమోదు చేయాల్సి ఉండగా, కావాలనే ఆన్‌లైన్ సెంటర్లకు తరలిస్తుండటం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల నుంచి వసూలు చేసిన డబ్బులలో సిబ్బందితో పాటు అధికారులకు ముట్టజెబుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆన్‌లైన్ సెంటర్లలో దందా..

చేర్యాల ప్రాంతంలో వేలాదిమంది రైతులు ఉన్నక్రమంలో ఒక్కో రైతు నుంచి రూ.50చొప్పున వసూలు చేసినా పెద్దమొత్తంలో దందా కొనసాగుతుంది. పలువురు ఏఈవోలు రైతువేదికల్లో నమోదు చేస్తున్నా, మరికొంతమంది స్థానికంగా అందుబాటులో ఉండకపోగా, ఫార్మర్ రిజిస్ట్రీ కోసం ఫోన్ చేసి వివరాలు అడిగితే ఆన్‌లైన్ సెంటర్‌కు వెళ్లమని చెబుతున్నారు. తీరా అక్కడికి వెళ్తే డబ్బులు ఇస్తేనే చేస్తామని తెగేసి చెబుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో అడిగినకాడికి ఇచ్చి రైతులు నమోదు చేయించుకుంటున్నారు.

రైతులకు తలనొప్పిగా..

గ్రామాల వారీగా రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన వ్యవసాయ శాఖాధికారులు అవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇతర ప్రాంతాలలో ఉన్న రైతులకు సరైన సమాచారం అందించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సాగుపనులు ముమ్మరం చేస్తున్న క్రమంలో గ్రామాల నుంచి చేర్యాలకు చేరుకుని ఆన్‌లైన్ సెంటర్‌లో నమోదు చేసుకోవడానికి రోజంతా గడచిపోతుందని వాపోతున్నారు. చేర్యాల ప్రాంతంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ రైతులకు భారంగా మారిన విషయమై ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని రైతులు జిల్లా వ్యవసాయశాఖాధికారిగా వ్యవహరిస్తున్న చేర్యాల ఏడీఏ రాధికను కోరుతున్నారు. అక్రమంగా చేస్తున్న వసూళ్లు నిలిపివేయించి గ్రామాల వారీగా రైతు వేదిక లలోనే ఉచితంగా నమోదు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే మరి.

మురుగుకాలువ నిర్మాణం జరిగేనా?

- పదేళ్లుగా స్థానికులకు ఇక్కట్లు


ములుగులోని అంబేడ్కర్ చౌరస్తాలో మురుగు కాలువ

ములుగు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మురుగుకాలువ నిర్మాణానిని మోక్షమెన్నడోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. గత పదేళ్లలో పాలకులు గానీ, నాయకులు గానీ మురుగు కాలువ నిర్మాణం గురించి పట్టించుకోలేదు. నాటి నుంచి ఇప్పటివరకు అలాగే మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. గతంలో వర్షాకాలంలో కొందరు మురుగు కాలువలో పడి చివర కుంటలో తేలిన సందర్భాలున్నాయి. ప్రమాదాలను నివారించాలంటే వెంటనే అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉందని పలువురు సూచిస్తున్నారు. మురికి కాలువ నిర్మాణం చేయకపోవడంతో పాటు ఓపెన్‌గా ఉండడం వల్ల చెత్త చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నది. డ్రైనేజీ నిర్మాణం చేపడితే ఈగలు, దోమల బెడద తగ్గుతుందని, అంతేకాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేస్తే దుర్వాసనను కూడా అరికట్టవచ్చని గ్రామస్తులు చెబుతున్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అధికారులు, నాయకులు చొరవ తీసుకొని మురుగు కాలువ నిర్మాణం కోసం సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతున్నారు. నిత్యం ప్రజలు తిరిగే అంబేడ్కర్ చౌరస్తాలో మురుగు కాలువ నిర్మాణం పనులను సత్వరమే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేతాలమ్మ మేడాలమ్మ సమేత మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం


మల్లికార్జునస్వామి సన్నిధిలో భక్తులు

ములుగు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్యాల గ్రామంలో గంగిశెట్టి గణేష్‌గుప్త ఆధ్వర్యంలో శ్రీ కేతాలమ్మ మేడాలమ్మ సమేత శ్రీ మల్లికార్జునస్వామి తృతీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, అలంకరణ అనంతరం అర్చన హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

జగదేవ్‌పూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో కొత్తగా 5 జూన్ 2025లోపు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు ఈ నెల 20వ తేదీలోగా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు భరోసాకు దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు వివరాల జిరాక్స్‌లను ఏఈవోలకు రైతు వేదికల వద్ద అందజేయాలని కోరారు. అంతకు ముందు రైతు భరోసా ఇచ్చి బ్యాంకు ఖాతా మార్పిడి చేయాలనుకునే రైతులు కూడా సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. భూభారతిలో నమోదై వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే ఈ సాయం నేరుగా రైతుల ఖాతాలో జమవుతుందన్నారు.

బస్వాపూర్‌లో నీటి కటకట



గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన ట్యాంకర్ వద్ద నీటి కోసం జనం తండ్లాట

కోహెడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్‌లో ఎన్నడూలేని విధంగా పది రోజుల నుంచి నీటికి కటకట మొదలైంది. గ్రామస్థులు నీళ్ల కోసం అష్ట కష్టాలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు కాలనీలలో రావడం లేదు. తాగడానికి నీళ్లు ఇవ్వకుంటే ఎలా అని స్థానికులు గ్రామపంచాయతీ ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇలాకాలోనే నీటికీ కటకటానా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. బోర్లు, బావుల ద్వారా నీటిని తెచ్చుకొని దాహార్తిని తీర్చుకుంటున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం చొరవ తీసుకొని తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ షాబుద్దీన్

సిద్దిపేట క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమని, చెట్లు లేకపోతే మనుగడ లేదని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ షాబుద్దీన్ అన్నారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మరో ఆలోచన లేకుండా ఎక్కడపడితే అక్కడ కొనోకార్పస్ మొక్కలను నాటించిందన్నారు. ఈ మొక్కలు చెట్లుగా ఎదిగినప్పటికీ ప్రజల ఆరోగ్యానికి హానికరంగా పరిణమించాయన్నారు. దీంతో పొద్దంతా చెట్లు కట్ చేయడం వల్ల మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నదని వివరించారు. వర్షాకాలం దృష్ట్యా ఎవరికీ ఇబ్బంది కలుగకుండా ఉండేందుకే ప్రమాదకరమైన కోనోకార్పస్ చెట్లను నరికివేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సీతా బాలు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


తైక్వాండో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

సిద్దిపేట క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):సిద్దిపేట పట్టణంలో ఐఎంఏ హాల్‌లో సిద్దిపేట జిల్లా తైక్వాండో అసోసియేషన్ వారు నిర్వహించిన తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో 60 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గెలుపొందిన తైక్వాండో విద్యార్థులకు కలర్ బెల్టులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్దిపేట జిల్లా తైక్వాండో గౌరవ అధ్యక్షుడు వేలేటి రాధాకృష్ణశర్మతో పాటు డీవైఎస్‌వో వెంకట నరసయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకోవడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందని, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తైక్వాండో నేర్చుకోవాలన్నారు. అనంతరం డీవైఎస్‌వో వెంకట నరసయ్య మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకోవడం ద్వారా క్రమశిక్షణ అలవడటంతో పాటు విద్యా ఉద్యోగాలలో 2శాతం స్పోర్ట్స్ కోటా కింద ప్రాధాన్యం లభిస్తుందన్నారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్దిపేట తైక్వాండో విద్యార్థులు రాష్ట్ర జాతీయస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి సిద్దిపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత, జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పల్లా' త్వరగా కోలుకోవాలని పూజలు


కొండాపూర్ గుట్టు మల్లన్న ఆలయంలో పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు/చేర్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని పలు మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పూజలు నిర్వహించారు. దూళిమిట్ట మండలంలోని కొండాపూర్‌లోని గట్టు మల్లన్న ఆలయంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంద యాదగిరి, మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా చేర్యాలలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సర్వమత ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా రామాలయం, చర్చి, మసీదులలో ప్రత్యేకపూజలు, ప్రార్థనలు నిర్వహించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

కొండపాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పేర్కొన్నారు. కేంద్రంలో మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వ పాలన 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కొండపాకలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బైరి శంకర్ మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ క్రమంలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీల సత్యం, మండల సీనియర్ నాయకులు సొప్పరి సుదర్శన్ , గడ్డమీది రామస్వామి, షేర్ నరేందర్, మంచాల శ్రీనివాస్ గౌడ్, గిరి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకుంటూ పరస్పర కుటుంబ క్షేమసమాచారాలను పంచుకున్నారు. నాడు ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ, విద్యాబుద్దులతో నేడు వివిధ స్థాయిల్లో ఉన్నామని గుర్తుచేసుకున్నారు. తమ విద్యాబుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

- సిద్దిపేట రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి)

దోస్త్ మూడో విడత డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం



డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్

సిద్దిపేట కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు మూడో విడత అడ్మిషన్ ప్రక్రియ జూన్ 13 నుంచి ప్రారంభమైందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యా బోధన, నిష్ణాతులైన అధ్యాపకులు, సకల సౌకర్యాలు గల ల్యాబ్స్, లైబ్రరీ అందుబాటులో ఉన్నందున ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని సూచించారు. జిల్లా దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె భాస్కర్ మాట్లాడుతూ ఇంటర్ పూర్తయిన విద్యార్థులు (మొదటి, రెండవ విడతలో రిజిస్ట్రేషన్ చేయని విద్యార్థులు) మూడవ విడతలో కొత్తగా రిజిస్ట్రేషన్ల కొరకు జూన్ 13 నుంచి జూన్ 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వెబ్ ఆప్షన్స్ కూడా జూన్ 13 నుండి జూన్ 19 వరకు ఇవ్వాలన్నారు. వీరికి జూన్ 23న సీట్లను కేటాయించనున్నట్టు తెలిపారు. మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 23 నుంచి 28 వరకు ఆన్లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. చివరగా అన్ని విడతలలో ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు జూన్ 24 నుంచి 28 మధ్యలో వ్యక్తిగతంగా కళాశాలను సందర్శించి ధ్రువపత్రాలను కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించి, కళాశాల రుసుమును చెల్లించి, తమ సీటును ధ్రువీకరించుకోవాలన్నారు. ఇప్పటికే రెండో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 13 నుంచి 18వ తేదీ వరకు ఆన్లైన్ సెల్ఫ్ రిపోర్ట్ చేయాలన్నారు.

దుర్గారెడ్డి సేవలు మరువలేనివి


పోస్ట్‌మన్ దుర్గారెడ్డి దంపతులకు సన్మానం చేస్తున్న దృశ్యం

కోహెడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చివరిరోజు వరకు కోహెడ పోస్ట్‌మన్‌గా పనిచేసిన ఎలసాని దుర్గారెడ్డి సేవలు మరువలేవని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ ఆఫీసర్ చంద్రమోహన్ పేర్కొన్నారు. 43 సంవత్సరాల పాటు పోస్ట్‌మన్‌గా సేవలందించి ఉద్యోగవిరమణ పొందిన దుర్గారెడ్డికి ఆదివారం మండలంలోని శనిగరం సబ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ ఆఫీసర్ చంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా దుర్గారెడ్డి దంపతులకు ఘనంగా సన్మానం చేశారు. బ్రాంచ్ అధికారి బాలయ్య, కర్ర రామచంద్రం, పోస్ట్‌మాస్టర్ మల్లయ్య, సహోద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిలదీస్తే అక్రమ కేసులా ?



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య

హుస్నాబాద్‌రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని నిలదీస్తే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టేందుకు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 17 నెలలు గడిచినా ఇప్పటి వరకు ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక ప్రజల దృష్టి మరల్చేందుకు కేసీఆర్ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి సూరంపల్లి పరశురాములు, పట్టణ మాజీ అధ్యక్షులు కన్నోజు రామకృష్ణ, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తాం: సీపీఐ

సిద్దిపేట అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మందపవన్ పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జరిగిన 16వ పట్టణ మహాసభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం సీపీఐ సిద్దిపేట పట్టణ నూతన కమిటీని 17 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా గజభీంకార్ బన్సీలాల్, పట్టణ సహాయ కార్యదర్శులుగా ఎస్ కె హరిఫ్, కర్నాల చంద్రంలను, కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్ల మంద పవన్ తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల శంకర్,అందె అశోక్,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే


బ్రహ్మకుమారీస్ సంస్థలో ఫాదర్స్ డే వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న పిల్లల తండ్రులు

సిద్దిపేట కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట శివాజీనగర్‌లోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు బీకే భవాని మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవించి పూజించే సంస్కృతి భారతదేశానిదని వివరించారు. మానవ సంబంధాల విలువలు తల్లిండ్రుల పట్ల గౌరవం చిన్నప్పటి నుంచే ఉపాధ్యాయులు, తల్లిండ్రులు పిల్లలకు తెలిసేలా పెంచాలన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సంస్థకు వచ్చే తండ్రులందరితో కలిసి కేక్ కట్ చేసి ఫాదర్స్‌డే వేడుకలను నిర్వహించారు. అనంతరం సంస్థ సభ్యులందరూ కలిసి ఆటవిడుపుగా చిన్న ఆటలాడుతూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బీకే స్వప్న, బీకే స్రవంతి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో మట్టుబెడుతున్నారు

(5వ పేజీ తరువాయి..)

జరిగి హత్యల వరకు దారితీసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. రాత్రి పూట వైన్స్ షాపులు మూసేసినా, అర్ధరాత్రి వరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం కొనసాగుతూనే ఉంది. బహిరంగంగా మద్యం తాగడం చట్టరీత్యా నేరం అయినప్పటికీ మందుబాబులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా ఎక్కడపడితే అక్కడ తాగేస్తున్నారు.

కఠిన చర్యలేవి?

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసుల పర్యవేక్షణ కొరవడిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి, జరిమానాలు విధించడం, అవసరమైతే జైలుకు పంపించడం వంటివి చేస్తున్నా మార్పు రావడం లేదు. మద్యం తాగినవారిని ప్రశ్నించిన పోలీసులపైనే తిరగబడ్డ సంఘటనలు ఉన్నాయి. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలతో పాటు, బహిరంగంగా మద్యం తాగేవారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరహా నేరాలను అరికట్టడానికి పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లోనూ అవగాహన పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు.